క్లుప్తంగా

నేడు సమావేశం

వల్లూరు: మండల పరిధిలో 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు మంగళవారం సామాజిక తనిఖీ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ , అనుబంధ శాఖల సిబ్బంది, వెలుగు, పంచాయతీ రాజ్ సిబ్బంది, ఉపాధి కూలీలు, రైతులు హాజరు కావాలని ఆమె కోరారు.

నాడు- నేడు పనుల పరిశీలన

పెద్దముడియం: మండలంలోని మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాడు-నేడు కింద జరుగుతున్న పనులను మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. పీహెచ్సీలో జరుగుతున్న ఆర్చి, బిల్డింగ్‌కి కలర్, బాత్ రూమ్స్ పనులను పరిశీలించారు. అనంతరం పీహెచ్సీలో అందుతున్న వైద్య సేవలను గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు డా. హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

పెద్దముడియం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

పన్నులు తప్పనిసరిగా చెల్లించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో లారీలకు సంబంధించిన పన్నులు ప్రభుత్వానికి తప్పనిసరిగా చెల్లించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ముద్దనూరు రోడ్డులో వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన లారీలకు సంబంధించిన లైసెన్స్‌లు, రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రభుత్వానికి పన్నులు వెంటనే చెల్లించాలన్నారు. పన్నులు కట్టాలనుకునే వారు మీసేవ కేంద్రాలలో కానీ, ఆన్‌లైన్ సెంటర్లలో కట్టవచ్చునని తెలిపారు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు పన్నులు కట్టకపోతే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనదారులందరూ పన్నులకు సంబంధించి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ముద్దనూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యల్లయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మహిళలతో కలిసి ఈ మేరకు ఇంచార్జి డిప్యూటీ తహశీల్దారు సౌజన్యకు వినతి పత్రం అందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని, భూమిలేని నిరుపేద కుటుంబాల్లోని మహిళలకు భూమిని పంపిణీ చేయాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను పునరుద్ధరణ చేసి రూ.100కోట్లు బడ్జెట్ కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అన్నదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని కచేరి రోడ్డులో ఉన్న శ్రీవీరనారాయణస్వామి అంధుల ఆశ్రమం, ఇప్పట్ల గ్రామ సమీపంలోని శ్రీలీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమాలలో సోమవారం ఎస్.వెంకట త్రివిక్రమ్, గాయత్రిదేవిల వివాహ దినోత్సవం సందర్భంగా అంధులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగనాథస్వామి ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, బంగారు నగల దుకాణ యజమాని బి.రమణ పాల్గొని భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు ఓం ప్రకాష్, ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం మండలంలో 1515 మంది పట్టభద్రులు

కమలాపురం: కమలాపురం మండలంలో 1515 మంది పట్టభద్రులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారని మండల తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి మండలానికి చెందిన 1515 మంది పట్టభద్రులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారని ఆయన అన్నారు. వారు ఓటు వేయడానికి రెండు పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేశామన్నారు. ఐసీడీఎస్ సభా భవనం, భవిత కేంద్రాలను పోలింగ్ స్టేషన్లుగా ఎంపిక చేశామన్నారు. ఆ కేంద్రాల్లో ఓటు వేయడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఐసీడీఎస్ సభా భవనంలో 890 మంది పట్టభద్రులు, భవిత కేంద్రంలో 625 మంది పట్ట భద్రులు ఓటు వేస్తారని ఆయన వివరించారు. అలాగే ఐసీడీఎస్ కార్యాలయం గదిలో 59 మంది ఉపాధ్యాయులు ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



ప్రచార కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

వల్లూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి విజయానికి పార్టీ నేతలు సమిష్టిగా కృషి చేయాలని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. కడప పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డికి మద్దతుగా వల్లూరు , చింతకొమ్మదిన్నె మండలాలకు చెందిన పార్టీ నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గడువు లోగా ఓటర్ల నమోదును పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ఓటరు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. పార్టీ అభ్యర్థి విజయానికి పూర్తి స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి పార్టీ నేతలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీలు నరేన్ రామాంజులు రెడ్డి, వెంకట సుబ్బయ్య, పార్టీ నేతలు శివ కుమార్ రెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వెన్నపూసకు మద్దతు ఇవ్వండి



మాట్లాడుతున్న వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయాలని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా సచివాలయ పరిధిలోని పట్టభద్రులను గుర్తించి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించాలన్నారు. మండలంలో అత్యధిక మెజార్టీ వచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.లక్ష్మీగాయత్రి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయండి

– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

పులివెందుల టౌన్ : త్వరలో జరిగే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎం.వి.రామచంద్రారెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివెందులలోని ప్రభుత్వ పాఠశాలలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, ఆ సంఘ రాష్ట్ర ఎన్నికల కన్వీనర్ తిరుపాల్, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటనాథరెడ్డి, ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు అమరనాథరెడ్డి, జేఎల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గురుకుల పాఠశాల టీచర్ నూరుల్లా, అపుస్మా అధ్యక్షుడు రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ మార్చిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు, పీఆర్టీయూ, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతిగా మరోసారి నిలిచారని బీసీ అధ్యయన కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు రసూల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎమ్మెల్సీ సీట్లలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు ఇచ్చి ఎంతో గొప్ప పేరు సంపాదించారన్నారు. దేశంలోనే బీసీలకు పదవులు ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. బీసీలందరూ చిత్తశుద్ధితో పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంగముని, మునీంద్ర, హరి పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీల ప్రభుత్వమని.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవులలో బీసీలకు పెద్ద పీట వేసి బీసీల పక్షపాతి అని నిరూపించుకున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీలకు 11ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వడం చాలా గర్వకారణమని అన్నారు. వైఎస్ జగన్ ఎన్నికల నాడు చేసిన వాగ్దానాలను ఒక్కొక్కటి నెరవేర్చుతూ తిరుగులేని ఏకైక సీఎంగా నిలిచారన్నారు. మొత్తం 18స్థానాలలో స్థానిక సంస్థల కోటా కింద 9, ఎమ్మెల్యే కోటా కింద 7, గవర్నర్ కోటా కింద 2 మొత్తం 18స్థానాలలో 11 స్థానాలు బీసీలకు కేటాయించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీల ప్రభుత్వంగా నిరూపించుకుందన్నారు. 2024 ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ 175కు 175 స్థానాలు గెలిచేందుకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

వేంపల్లె : ఎమ్మెల్సీ పదవులలో వడ్డెర సంఘీయుడు గుంటూరుకు చెందిన ఏసురత్నంకు సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వడ్డెరుల సంఘ మండలాధ్యక్షుడు ఎం.సంటెన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ.. వడ్డెరుల కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్ల పదవులు కల్పించారన్నారు.

జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డికి ఘన నివాళి



మహేశ్వరరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం ఆర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ తుమ్మల మహేశ్వరరెడ్డి మృతదేహానికి సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం గంగమ్మ జాతరలో సిరిబండి మహోత్సవంలో జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి ప్రమాదవశాత్తు బండి చక్రాల కింద పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం హుటాహుటిన హైదరాబాద్ నుంచి తుమ్మలపల్లె గ్రామానికి చేరుకున్నారు. మహేశ్వరరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే ఈ సంఘటన గురించి మహేశ్వరరెడ్డి కుమారుడు హేమంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ మహేశ్వరరెడ్డి మృతి చాలా బాధాకరమని, పార్టీకి ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. అలాగే జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, గండి దేవస్థాన ఈఓ ముకుందారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి, వేల్పుల రాము, ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, తదితరులు మహేశ్వరరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

కనీస మద్దతు ధరతో బుడ్డశనగల కొనుగోలు

వేంపల్లె : రైతు కనీస మద్దతు ధర్పై బుడ్డశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఏడీఏ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాగూరు గ్రామంలోని ఉన్న గోడౌన్ వద్ద ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో బుడ్డశనగ కొనుగోలును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.5335లు క్వింటా మద్దతు ధర కల్పించి బుడ్డశనగ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి ప్రతి రైతు తాను పండించిన బుడ్డ శనగలు అమ్మేందుకు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుందని.. దాన్ని వారికి కేటాయించిన సమయంలో రైతులు శనగలు తీసుకుని రావాలన్నారు.



శనగల కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ అశోక్‌రెడ్డి, తదితరులు

ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలి

– మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని కౌన్సిల్ హాలులో సచివాలయ ప్లానింగ్, శానిటేషన్ సెక్రటరీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాస్టిక్ నిషేధం, ఇంటి నిర్మాణ వ్యర్థాల తరలింపు, నీటి సరఫరా, నీటి పైపులైన్ లీకేజీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ వేసవి లో నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని.. ఎక్కడే కానీ పైపులైన్ లీకేజీలు కాకుండా చూసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వదలకుండా చూడాలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పులివెందుల మున్సిపాలిటీకి మరిన్ని అవార్డులు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుభాష్ చంద్ర బోస్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదు :

పట్టణంలోని హోటళ్లు, మాంసపు దుకాణాల యజమానులు ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని పలు హోటళ్లు, మాంసపు దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో దుకాణదారులెవరూ ప్లాస్టిక్ కవర్లు కానీ, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకం, అమ్మకం జరపరాదన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వ్యాపార ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది ఇడ్లీ పాత్రలో గుడ్డ బదులు ప్లాస్టిక్ వాడుతున్నారని.. ఇది ఆరోగ్యానికి చాలా హానికరమని.. వారందరికీ జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అలాగే మాంసపు దుకాణాలలో ఇష్టానుసారంగా మాంసపు ధరలు నిర్ణయించి అమ్మడం సరికాదన్నారు. స్వచ్ఛ పులివెందులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు కృష్ణార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, నటరాజ్‌లతోపాటు సీసీ నాగేంద్ర పాల్గొన్నారు.

మహిళల సమస్యలు పరిష్కరించాలి

వీరపునాయునిపల్లె: మహిళల సమస్యలు పరిష్కరించాలని డప్పు కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగ భూషణం మాదిగ అన్నారు. ప్రస్తుతం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం తహసీల్దార్ ఉదయ భారతికి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మాదిగ పోరాట సమితి ఆధ్వర్యంలో మహిళలకు అండగా ఉంటామని, వారి సమస్యలు పరిష్కరించేందుకు పోరాటాలు చేస్తామన్నారు.

యువకుడు అదృశ్యం

కొండాపురం: మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బంధం అరుణ్‌కుమార్ (19) ఈనెల 7 వ తేది నుంచి కనబడలేదని కొండాపురం ఏఎస్ఐ ఉత్తమ్‌రెడ్డి సోమవారం తెలిపారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన గంగాధర్ తనయుడు అరుణ్‌కుమార్ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేశాడు. ముద్దనూరు రైల్వే విద్యుత్ శాఖ కార్యా లయంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 7 నుంచి కనిపించక పోవడంతో అరుణ్ తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

జమ్మలమడుగు రూరల్: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ అన్నారు. సోమవారం జమ్మలమడుగు మండలపరిధిలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గర్భవతులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా 21 మంది గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తస్మియా, సిహెచ్ఓ రాజేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



సూచనలు ఇస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్

పులివెందుల రూరల్ : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణ పరిధిలోని జెఎన్‌టీయూ వెనుక వైపున జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలో 7వేల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని.. ఈ నిర్మాణాలను సంబంధిత అధికారులు త్వరగా చేపట్టి నాణ్యతగా నిర్మించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్ : పులివెందుల డిపో నుంచి లక్కిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న గంగమ్మ జాతరకు 25 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం ఉమా మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె గ్రామసమీపంలో ఉన్న గంగమ్మ జాతరకు ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని.. భక్తులెవరూ ప్రవేట్ వాహనాలలో ప్రయాణించి ప్రమాదాలకు గురికావద్దన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమన్నారు.

పథకాలు, రుణాలపై అవగాహన

లింగాల : మండల పరిధిలోని అంకేవానిపల్లె గ్రామంలో సోమవారం లింగాల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత, ఇన్సూరెన్స్ పథకాలు, రుణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కళాజాత బృంద సభ్యులు రవి, మహేష్‌లు మాటల ద్వారా, పాటల ద్వారా, మ్యాజిక్ షో ద్వారా ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై చక్కగా వివరించారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ జ్ఞాన మూర్తి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హోమాలు



కమలాపురం: మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో వెలసిన శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయంలో గ్రామ ప్రజలు వివిధ రకాల హోమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం మాఘమాస అమావాస్య సందర్భంగా గ్రామ పెద్దలు యలంకూరు రామసుబ్బారెడ్డి, సీతమ్మ దంపతుల ఆధ్వర్యంలో గణపతి హోమం, రుద్ర హోమం, చండీ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు రామ కేశవ శర్మ ఆచార్యత్వమున హోమాలు నిర్వహించారు. గ్రామం నుంచే కాక సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

– సీనియర్ సివిల్ జడ్జి కవిత



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

చెన్నూరు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కవిత పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చెన్నూరు మండలంలోని ఎస్టీ కాలనీ, దౌలతాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కవిత మాట్లాడుతూ సామాజిక న్యాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ వారిని సంప్రదించవచ్చునన్నారు. అలాగే టెలి లా, టెలి లా యాప్ ద్వారా కేసులు రిజిష్టర్, న్యాయ సహాయం రక్షణ సలహా సంస్థ (ఎల్ఏడీసీఎస్) గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, న్యాయవాది చంద్రకాంతమ్మ పాల్గొన్నారు.

పెద్దాయనకు బాసట



చింతకొమ్మదిన్నె: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పెద్దాయనకు ఓ యువకుడు సాయపడ్డాడు. కడప నగరం భగత్‌సింగ్ నగర్‌కు చెందిన అబుకర్ అనే యువకుడు తన ఇంటి సమీపంలో వృద్ధుడైన ఆలీషేర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందులు తెచ్చి ఇచ్చే వారు ఎవరూ లేకపోవడంతో అబుకర్ తన ద్విచక్ర వాహనంలో ఆ వృద్ధుడిని కూర్చోబెట్టుకుని కడప నగరానికి సరిగా బయలుదేరారు. సరిగ్గా ఊటుకూరు వద్దకు రాగానే తన వాహనంలో పెట్రోల్ అయి పోయింది. పెట్రోలు అయిపోతే వాహనాన్ని తోసుకుపోవడం ఎంత కష్టమో తెలుసు. అయినా కూడా ఆ యువకుడు ఆ వృద్ధుడిని అలాగే ద్విచక్ర వాహనంలో కూర్చోబెట్టుకుని తోసుకుంటూ కడప నగరానికి వెళ్లాడు. ఆ యువకుడి సాయానికి ఆ వృద్ధుడు కృతజ్ఞతలు తెలిపారు.